TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
సంచలన తెలుగు దినపత్రిక
PRGI: TGTEL/26/A3129

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి





EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:44 WEDNESDAY ,JUNE 24,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 44 బుధవారం 24 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-




# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం

కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు ఫలప్రదం
ఎస్బీఐకాప్స్ ను కన్సల్టెంట్‌గా నియమించాలని నిర్ణయం

హంసకలం వార్త జూన్ 23 హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1 స్వాధీనం,ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు సానుకూల ఫలితాన్నిచ్చాయి. రెండు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన ఆటంకాలను మిగతా2లో



# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి...

- కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని తుమ్మల, ఉత్తమ్ విన్నపం
- భద్రాచలంకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారన్న మంత్రులు
- సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి..
- డిల్లీలో కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాంమోహన్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసిన మంత్రులు తుమ్మల మరియు ఉత్తమ్..
- భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఎయిర్ పోర్ట్ ..

హంసకలం వార్త జూన్ 23 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.మంగళవారం నాడు డిల్లీలో రాంమోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రులు తుమ్మల ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే మిగతా2లో

# హైదరాబాద్‌లో భారీ చోరీ

ఏటీఎంకు తెచ్చిన రూ.17 లక్షలు మాయం!




- -హైదరాబాద్ ఐఎస్ సదన్‌లో ఏటీఎం నగదు చోరీ
- -వ్యాన్ డ్రైవర్ పరారీ.. కుమ్మక్కుపై పోలీసుల అనుమానం
- -బైక్‌పై వచ్చి నగదు ట్రంకును ఎత్తుకెళ్లిన దుండగులు

హంసకలం వార్త : హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్ట పగలే భారీ చోరీ చోటు చేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకు వచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండ గులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించ కుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు మిగతా2లో



# సన్న రకాలు సాగు చేయండి

-రైతులు సంక్షేమం సర్కార్ ధ్యేయం
-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

హంసకలం వార్త జూన్ 23 :జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మిగతా2లో

# రఘునాథపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

-కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ -వరద నీటి కాలువల నిర్మాణానికి నిధుల కోసం విజ్ఞప్తి -37 పంచాయతీల్లో 28 ఏజెన్సీ, గిరిజన గ్రామాలు -శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ 2

## నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అరెస్ట్

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. 2

## లక్నో అగ్నిప్రమాదం.. 2016లో కూల్చివేత ఉత్తర్వులు ఇచ్చి రెండు నెలల్లోనే రద్దు..!

# తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్..

- -హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి భారీ పథకం
- -పథకానికి మంచి పేరు సూచిస్తే లక్ష రూపాయల నగదు బహుమతి
- -తెలంగాణ హౌసింగ్ బోర్డ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సూచనలు పంపాలి

2

# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

హంసకలం వార్త జూన్ 23: జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం,సిర్స, రొయ్యలపల్లి,ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో మిగతా2లో



# సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా



-రేవంత్‌రెడ్డి రెండుసార్లు లేఖ రాసినట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి
-జూన్ 22న అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడి
-ఇవాళ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో సంయుక్త భేటీ జరిగినట్లు తెలిపారు

హంసకలం వార్త: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు. జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం మిగతా2లో

# రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది



రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్
సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ
రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ

2

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం..!

రెండు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన ఆటంకాలను తొలగించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సోమవారం రాత్రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్,కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మంగళవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో మరో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ (వాల్యుయేషన్),స్వాధీన ప్రక్రియ, రుణ సేకరణ,రుణ సంస్థ ఎంపిక, ఫేజ్-2 విస్తరణ,నిర్మాణ వ్యయం తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఎస్బీఐకాప్స్ ను కన్సల్టెంట్‌గా నియమించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు.ఎస్బీఐకాప్స్ సమగ్ర నివేదిక ఆధారంగా మెట్రో ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నారు.అలాగే ఈ అధ్యయన ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున ఒక అధికారి,రాష్ట్ర ప్రభుత్వం తరపున పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిని సమన్వయ అధికారులుగా నియమించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ నిర్ణయాలతో హైదరా బాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేశామని అక్కడ త్వరగా ఫీజుబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

**జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు..**
**హెవీ వాటర్ ప్లాంట్..ఐటీసీ**

బీ. పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డైన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# సన్న రకాలు సాగు చేయండి

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు.ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు.గొల్లపల్లి మండలం శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరం గా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేది నుంచి 31వ తేది వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం,సిర్స, రొయ్యల పల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి.రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి.వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి.ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని,ఆల్గాం, వెంచపల్లి,జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని,రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి.రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వృత్తి విద్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడంతో పాటు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ లో నీటి వనరుల ఏర్పాటుకు 40 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పున: ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు,విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని,జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, 'రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## లక్నో అగ్నిప్రమాదం.. 2016లో కూల్చివేత ఉత్తర్వులు ఇచ్చి రెండు నెలల్లోనే రద్దు..!

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. అలీగంజ్‌లోని ఒక మూడంతస్తుల వాణిజ్య భవనంలో సోమవారం మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతుల్లో అత్యధికులు యానిమేషన్ శిక్షణా కేంద్రానికి హాజరైన విద్యార్థులే కావడం గమనార్హం. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దు చేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చివేత ఆదేశాలు రద్దయ్యాయి. కాగా, 1980వ సంవత్సరం నుంచి ఈ స్థలం పలువురి చేతులు మారుతూ వచ్చిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా స్పందించారు.

# హైదరాబాద్‌లో భారీ చోరీ..

హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకువచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఓ క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు వ్యాన్‌లో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది ఏటీఎం కియోస్క్‌లోకి వెళ్లిన సమయంలో, ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వ్యాన్‌లో ఉన్న నగదు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ కూడా పరారీ కావడంతో, అతడు దొంగలతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా డ్రైవర్ పాత్రపైనే దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే ఈ తరహా చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు. జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

## నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అరెస్ట్

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మల్లారెడ్డిని అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏసీబీ అధికారులు మల్లారెడ్డి నివాసంతో సహా బంధువులు, బినామీలకు చెందిన 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో 4 గృహాలు, కమర్షియల్ భవనం, 8 ఓపెన్ ప్లాట్లు సహా 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. 3.31 లక్షల రూపాయలు, 50 లక్షల రూపాయల బ్యాంక్ డిపాజిట్లను ఫ్రీజ్ చేశారు. భార్య, కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంక్ లాకర్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు తేలిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు మల్లారెడ్డిని అరెస్ట్ చేశారు. ఆయనను నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నారు. కాగా, మూడు సంవత్సరాల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి విధుల్లో చేరారు. ఇటీవల ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. దీంతో ఈరోజు తెల్లవారుజామునే ప్రత్యేక బృందాలు నిజామాబాద్ చేరుకుని.. అక్కడి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు

## తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్..

హైదరాబాద్ నగరంలో ప్రతిపాదిత భారీ గృహ నిర్మాణ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను కోరుతోంది. ఈ పథకానికి అత్యుత్తమ పేరును సూచించిన విజేతకు తెలంగాణ గృహనిర్మాణ సంస్థ (టీజీహెచ్‌బీ) రూ. లక్ష నగదు బహుమతిని ప్రకటించింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో లక్ష ఇళ్లను నిర్మించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ భారీ ప్రాజెక్టుకు సముచితమైన పేరును నిర్ణయించే ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని భావిస్తున్నట్లు హౌసింగ్ బోర్డ్ వైస్-ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ సూచనలను స్తష్ట్రు.శీటట౹ఋ౹ఆఖ్రీ అనే అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సమర్పించవచ్చు. పేర్లను పంపేందుకు 2026 జూన్ 28వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు.

## రఘునాథపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తన నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.

# సంపాదకీయం

## మూర్తీభవించిన జాతీయ సమైక్యత

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పేరు వినగానే దేశభక్తి, సిద్ధాంత నిబద్ధత, జాతీయ సమైక్యత మనకు గుర్తుకొస్తాయి. 1943లో బెంగాల్‌లో సంభవించిన భయంకర కరవులో లక్షలాది ప్రజలు ఆకలి, పోషకాహార లోపంతో ప్రాణాలు కోల్పోయినప్పుడు, బ్రిటిష్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ప్రశ్నించిన నాయకుడు ఆయన. ఆ సమయంలో బెంగాల్ ఆర్థికమంత్రిగా ఉన్న ముఖర్జీ, బాధితులకు తక్షణ సహాయం అందించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. స్పందన లేకపోవడంతో మంత్రి పదవికి రాజీనామా చేసి స్వయంగా రిలీఫ్ కార్యక్రమాలు నిర్వహించి, దేశవ్యాప్తంగా నిధులు సేకరించి కరవు బాధితులకు అండగా నిలిచారు. ఆయన మరణానంతరం అప్పటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నివాళులర్పిస్తూ, "మౌనంలోనే అత్యంత క్రూరమైన అసత్యాలు వ్యాపిస్తాయి, అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం కూడా ఒక నేరమే, ప్రజా జీవితంలో ఆయన తన అంతరంగ విశ్వాసాలను వ్యక్తపరచడానికి ఎప్పుడూ వెనుకాడలేదు" అని పేర్కొనడం ముఖర్జీ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. 1901 జూలై 6న కలకత్తాలో జన్మించిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిన్న వయస్సు నుంచే అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఇంగ్లీషులో బీఏ ఆనర్స్, బెంగాలీలో ఎంఏ, లండన్‌లో న్యాయశాస్త్రం అభ్యసించి బారిస్టర్‌గా నమోదు అయ్యారు. కేవలం 33 ఏళ్లకే కలకత్తా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టడం ఆయన మేధస్సుకు నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం, సామ్యవాదం ప్రభావం పెరుగుతున్న కాలంలో దేశ సమైక్యతకు, జాతీయ ప్రయోజనాలకు జాతీయవాదమే సరైన మార్గమని ఆయన విశ్వసించారు. కలకత్తాలోని ప్రముఖ న్యాయవాది నిర్మల్ చంద్ర ఛటర్జీ, వీర్ సావర్కర్ పర్యటన సందర్భంగా నగరంలోని మేధావుల కోసం ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ముఖర్జీని ఆహ్వానించారు. వీర్ సావర్కర్ ఆలోచనల ప్రభావంతో ముఖర్జీ జాతీయవాద ఉద్యమంలో చురుకుగా పాల్గొని, అఖిల భారత హిందూ మహాసభతో కలిసి పనిచేశారు. 1929లో శాసనమండలికి ఎన్నికైన ముఖర్జీ, తరువాత బెంగాల్ ఆర్థికమంత్రిగా సేవలందించారు. 1946లో మహమ్మద్ అలీ జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగ్ ప్రత్యేక పాకిస్థాన్ కోసం ప్రకటించిన 'డైరెక్ట్ యాక్షన్ డే' అనంతరం కలకత్తా, నౌఖాళీ, తిప్పర్ ప్రాంతాల్లో చెలరేగిన మతహింస దేశాన్ని కుదిపేసింది. ముస్లిం మతోన్మాదం వల్ల దాదాపు 20వేల మందికి పైగా హిందువులు ప్రాణాలు కోల్పోయారు. చరిత్రలో దీనిని 'గ్రేట్ కలకత్తా కిల్లింగ్స్'గా పేర్కొంటారు. ఆ సమయంలో బాధితుల్లో విశ్వాసం నింపేందుకు, సామాజిక శాంతి నెలకొల్పేందుకు ఆయన కృషి చేశారు. 1947లో రాజ్యాంగ సభ సభ్యునిగా భారత రాజ్యాంగ రూపకల్పనలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం మహాత్మాగాంధీ సూచనతో జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో పరిశ్రమలు, సరఫరాలశాఖ మంత్రిగా చేరారు. స్వతంత్ర భారతదేశ తొలి పారిశ్రామిక విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, కుటీర, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. హ్యాండ్లూమ్, హస్తకళలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి తీసుకున్న చర్యలు దేశ ఆర్థిక నిర్మాణానికి బలమైన పునాది వేశాయి. అయితే తూర్పు పాకిస్థాన్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆయనను తీవ్రంగా కలచివేశాయి. శరణార్థుల సమస్య, మైనారిటీల భద్రత విషయంలో భారత ప్రభుత్వం మరింత దృఢంగా వ్యవహరించాలని ఆయన కోరారు. నెహ్రూ--లియాకత్ ఒప్పందంపై తీవ్ర అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో 1950లో కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. దేశ రాజకీయాలకు ఒక ప్రత్యామ్నాయ జాతీయవాద దిశను అందించాలనే సంకల్పంతో ఆయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్‌సంఘచాలక్ ఎంఎస్ గోల్వాల్కర్ (గురూజీ)తో కలకత్తాలో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఆ చర్చల ఫలితంగా 1951లో ఢిల్లీలో జన్‌సంఘ్‌ను స్థాపించారు. జన్‌సంఘ్ నిర్మాణానికి అంకితభావం కలిగిన సంఘ్ ప్రచారక్‌లను ముఖర్జీకి గురూజీ అందించారు. వారిలో దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపేయి, నానాజీ దేశముఖ్, సుందర్‌సింగ్ భండారి, జగన్నాథరావు జోషి, కుశాభావ్ ఠాక్రే వంటి ప్రముఖులు ఉన్నారు. వీరందరూ జనసంఘ్‌ను దేశవ్యాప్త రాజకీయశక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. 1952 తొలి సాధారణ ఎన్నికల్లో జనసంఘ్ పరిమిత వనరులతో పోటీ చేసి, మూడు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. సభ్యుల సంఖ్య తక్కువైనా, ముఖర్జీ ప్రతిపక్ష స్వరాన్ని బలంగా వినిపించారు. పార్లమెంటులో ఆయన ప్రసంగాలు వాస్తవాలు, తర్కం, హాస్యచతురతతో నిండి ఉండేవి. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు హిరెన్ ముఖర్జీ వంటి నాయకులు ముఖర్జీ వాదనల పట్ల శ్రద్ధాసక్తులు కనబరిచేవారు. రాజకీయ భేదాలు ఉన్నా, ప్రత్యర్థులు కూడా ఆయన మేధస్సును గౌరవించేవారు. దేశ విభజన అనంతరం జమ్మూ--కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడం, భారత పౌరులు అక్కడికి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతి అవసరమవడం ముఖర్జీని తీవ్రంగా కలచివేసింది. "ఒకే దేశంలో రెండు విధానాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండవు" అనే ఆయన నినాదం దేశవ్యాప్తంగా మారుమోగింది. కశ్మీర్ సంపూర్ణ విలీన ఉద్యమంలో భాగంగా 1953లో కశ్మీర్‌కు బయలుదేరిన ఆయనను అరెస్టు చేసి శ్రీనగర్‌లో నిర్బంధించారు. 40 రోజుల నిర్బంధం అనంతరం 1953 జూన్ 23న అనారోగ్యంతో ముఖర్జీ మరణించారు. అప్పటికి ఆయన వయసు కేవలం 52 ఏళ్లు మాత్రమే. పిన్న వయసులోనే ప్రతిభ చూపిన ఒక గొప్ప జాతీయవాద నాయకుడిని దేశం కోల్పోయింది. డాక్టర్ ముఖర్జీ నాటిన చిన్న విత్తనమే భారతీయ జనతా పార్టీ అనే మహావృక్షంగా ఎదిగి, ఆయన భావజాలాన్ని వ్యాపింపజేసింది. 2019లో ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయంతో ఆర్టికల్ 370 రద్దు కావడం ఒక చరిత్రాత్మక ఘట్టం. కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని అది మరొకసారి ప్రపంచానికి స్పష్టం చేసి పాకిస్థాన్‌కు కనువిప్పు కలిగించింది. ఆర్టికల్ 370 రద్దుతో ముఖర్జీ కన్న ఒక కల నెరవేరినట్లయింది. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తున్నది-- 'పదవుల కోసం కాదు, సిద్ధాంతాల కోసం జీవించిన నాయకులు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు' అని. ఆయన త్యాగం ఒక వ్యక్తి గాథ కాదు-- భారత జాతీయ సమైక్యత కోసం సాగిన ఒక మహాయజ్ఞం. భారతమాతకు అంకితమైన ఆ మహనీయునికి నా వినమ్ర నివాళులు.

# కులం గోడలు ఆ ఒక్కచోటేనా?

విద్య ద్వారా కులం అడ్డుగోడలు కూల్చుతామని రాష్ట్ర ముఖ్యమంత్రులు మాట్లాడటాన్ని ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం ఊహించలేం! సర్వాంతర్యామిలా కులం అన్నిరంగాల్లో పాతుకుపోయిన పరిస్థితుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాన్నొక అడ్డుగోడగా భావించటమే కాదు, దాన్ని కూల్చటానికంటూ ఒక కార్యాచరణనూ మొదలుపెట్టారు. ఒక కోణం నుంచి చూస్తే కారుచీకట్లో కాంతిరేఖలాగా ఇది కనిపిస్తుంది. మరో కోణం నుంచి చూస్తే ఇదొక ముందడుగు లాగానే కన్పిస్తుంది తప్ప గమ్యాన్ని చేరుకోగలమా? లేదా? అన్న సందేహాన్నీ కలగచేస్తుంది. ఇప్పటివరకూ విద్యావ్యవస్థను ఎంతగా దారితప్పించామో నిశితంగా పరిశీలిస్తే ఈ సందేహంలో సముచితతత్వం కొంతవరకూ అర్థమవుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు విడివిడిగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేయటం ద్వారా సమాజంలో ఉన్న కుల/వర్గ విభజనలను మరింతగా స్థిరీకరిస్తున్నామని రేవంత్ పదేపదే విమర్శిస్తున్నారు. విద్యార్థి దశలోనే పిల్లల్లో కులాల అడ్డుగోడలను కట్టటం ద్వారా వాళ్లలో సామాజిక సమానత్వ భావన, సౌభ్రాతృత్వం అభివృద్ధికావటం లేదని రేవంత్ వ్యక్తంచేస్తున్న ఆందోళనలో సహేతుకతను కాదనలేం. దీనికి విరుగుడుగా రేవంత్ ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ప్రాజెక్టును చేపట్టింది. నియోజకవర్గానికి ఒకటిచొప్పున 119 స్కూళ్లు ఏర్పాటుచేయాలన్నది ఆ ప్రాజెక్టు లక్ష్యం. ఇప్పటికే చాలాచోట్ల వీటి నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. కొన్నిచోట్ల నిర్మాణాలూ మొదలయ్యాయి. ఒక్కో స్కూలుకు దాదాపు రూ.200 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారు. అన్ని స్కూళ్లకు కలిపి రూ.21,000 కోట్లను వ్యయంచేయటానికి ప్రణాళికలూ తయారయ్యాయి. భారీ వ్యయమయ్యే ఏ ప్రాజెక్టుకూ స్వంత నిధులను కేటాయించలేని పరిస్థితి ఉండటంతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం విదేశీ, స్వదేశీ అప్పులనూ తీసుకువస్తున్నారు. ఈ స్కూళ్లల్లో విద్యార్థులను ఎలా కలిపి ఉంచుతారో, అంటే ఒక తరగతిలో అన్ని వర్గాల పిల్లలూ ఉండే విధంగా ఎలాంటి ఏర్పాటుచేస్తారో ఇంకా స్పష్టంకాలేదు. ఇప్పుడున్న వర్గాలవారీ స్కూళ్లను అలాగే కొనసాగిస్తూ ఒకే కాంపౌండ్‌వాల్ పరిధిలోకి వాటిని తీసుకువచ్చినంత మాత్రాన పెద్దగా ప్రయోజనం ఉండదనే వాదనను కొన్ని ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఆలోచనే ఇదైతే ఈ వాదనను అంత తేలికగా కొట్టేయలేం. విద్యాబోధనలో విడివిడిగానూ ఆటపాటల్లో మాత్రం కలివిడిగానూ ఉంచే ఏర్పాట్లు అనుకున్న ఫలితాలను ఇవ్వవు. కులరహిత ఆలోచనలనూ, హేతుబద్ధ అభిప్రాయాలనూ విద్యార్థుల్లో కలగచేయటానికి తరగతిగదులు ఉపయోగపడినట్లుగా మిగతావి ఉపయోగపడవు. ప్రబలంగా ఉండే అభిప్రాయాలను ప్రశ్నించే తత్వాన్నీ, కొత్త విషయాల పట్ల జిజ్ఞాసనూ తరగతి గదిలోనే పెంపొందించటానికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. ఆటపాటల సమయంలో పోటీయే ప్రధానంగా ఉంటుంది తప్ప ఇతర ఆలోచనలపై అంతగా శ్రద్ధచూపే అవకాశం ఉంటుందని అనుకోలేం. కాస్త మంచి సౌకర్యాలతో మెరుగైన బోధనను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన రెసిడెన్షియల్ స్కూళ్లు సాధారణ ప్రభుత్వ పాఠశాలలతో పోల్చితే కొంతకాలం ఆశించిన ఫలితాలను ఎంతోకొంత అందించాయి. కానీ క్రమేపీ వాటికీ ఆదరణ తగ్గుతోన్న దృశ్యమే కనపడుతోంది. ఆ స్కూళ్లలోనూ సీట్లు మిగిలిపోతున్నాయి. ప్రమాణాలూ పడిపోతున్నాయి. వీటికి తోడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలనే అడ్డుగోడలు విద్యార్థుల మధ్య స్థిరంగా ఉండటానికి అవి తోడ్పడుతున్నాయన్న వ్యాఖ్యలూ ఎక్కువయ్యాయి. బయట అన్నిరంగాల్లో కులం ఆధారంగా వ్యవహారాలు చేస్తూ, రాజకీయాలనే కులం లెక్కల చుట్టూ తిప్పుతున్న నేపథ్యంలో విద్యకు సంబంధించిన ఒక విభాగంలో కులాల అడ్డుగోడలను కూల్చివేయటమూ అంతతేలిక కాదు. ఈ పరిమితి ఉన్నా విద్యార్థుల్లో వ్యక్తిత్వం రూపొందే దశలో కులం అడ్డుగోడగా మారుతోందని గ్రహించి, దాన్నొక తీవ్రసమస్యగా పరిగణించటం స్వాగతించాల్సిన విషయమే! పౌరులుగా









అందరమూ సమానమన్న భావన పిల్లల్లో కలగటానికి పాఠశాలలకు మించిన వేదిక మరొకటి లేదు. పాఠ్యాంశాలను ఆ లక్ష్యంతో తయారుచేసి, కులం ఆధారంగా ఉండే మన సామాజిక వ్యవస్థతో కలిగే నష్టాన్ని అక్కడ చెప్పగలిగితే దానివల్ల కలిగే మేలు చాలా ఉంటుంది. కానీ మొత్తంగా పాఠశాల విద్యను మనంత దారుణంగా ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ నిర్లక్ష్యం చేయలేదు. ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశాన్ని తీసుకున్నా అక్కడ ప్రభుత్వరంగంలోని పాఠశాలలు పటిష్ఠంగా ఉన్న పరిస్థితి స్పష్టంగా కనపడుతుంది. ఏడాదేడాదికి ప్రభుత్వ పాఠశాలను పిల్లలు వదిలేస్తున్న స్థితిని అక్కడ చూడలేం. వ్యక్తిత్వం పాదుకుని అదొక స్థిరత్వాన్ని సంపాదించుకునే దశ వరకూ అన్నివర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే అక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. సామాజిక సమానత్వ భావనకు బలమైన పునాదులు అలాగే పడుతున్నాయి. ఆర్థికంగా తారతమ్యాలున్న కుటుంబాల నుంచి వచ్చినా ఒకే పాఠశాలల్లో ఏళ్లపాటు కలిసి చదువుకోవటం వల్ల ఏర్పడిన సాహచర్యంతో ఒకొళ్ల పరిస్థితి మరొకళ్లు సహానుభూతితో అర్థంచేసుకునే వీలుంటుంది. అమెరికా అంటే అంతా ప్రైవేటుమయం అని అనుకుంటాం. కానీ అక్కడ 90శాతం పిల్లలు ప్రభుత్వరంగంలోని పాఠశాలల్లోనే చదువుతున్నారు. పన్నెండో తరగతి వరకూ ఉన్న పాఠశాలలు అక్కడ 1,37,000 ఉంటే, వాటిల్లో 30,500 మాత్రమే ప్రైవేటు స్కూళ్లు. వాటిల్లో చదివే విద్యార్థులు పదిశాతానికి మించరు. ఆ ప్రైవేటు స్కూళ్లు కూడా ప్రభుత్వం, స్థానిక సంస్థలు నిర్దేశించిన నిబంధనల మేరకే నడుస్తాయి. తెలంగాణలోనైనా, ఆంధ్రాలోనైనా 60శాతం మంది పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలలను నిబంధనల ప్రకారం నడిపేలా చూస్తే చాలావరకూ మూతపడతాయి. మొత్తంగా పాఠశాల విద్యలో నాణ్యమైన విద్యను అందించటంలో ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేటురంగం కూడా దిగజారేలా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పడింది. కొంచెం అటూఇటూగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. నిబంధనలమేరకు నడిచేలా ప్రైవేటురంగాన్ని నియంత్రించలేని అసమర్థత ఒక్క విద్యారంగానికే పరిమితం అవ్వలేదు. కానీ విద్యారంగంలో కనపడే ఆ అసమర్థత తెచ్చిపెట్టే విపరిణామాల ప్రభావం చాలాకాలంపాటు ఉంటుంది. ప్రాథమిక విద్యకు కొంచెం మెరుగ్గా ప్రాధాన్యం ఇచ్చిన రెండుమూడు రాష్ట్రాలు మానవాభివృద్ధిలో ముందున్నాయి. కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్‌ను చూస్తే ఇదే అర్థం అవుతుంది. ఈ విషయాన్ని పాతికేళ్ల క్రితమే అమర్త్యసేన్, జాన్‌డ్రేజ్‌లు విశ్లేషించి చెప్పారు. ఇతర ప్రజాస్వామ్యదేశాలైన జర్మనీ (90--92శాతం), స్వీడన్ (85--90శాతం), ఫ్రాన్స్ (80--85శాతం), యునైటెడ్ కింగ్‌డమ్ (93శాతం)ల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఎక్కువ. నెదర్లాండ్స్, బెల్జియం లాంటి దేశాల్లో స్వల్పసంఖ్యలో ఉన్న ప్రైవేటు స్కూళ్లకు కూడా ప్రభుత్వ నిధులు అందుతాయి. అందుకే అవన్నీ నిబంధనలను కచ్చితంగా పాటిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలను తీసుకున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించేవారే ఎక్కువ కనపడతారు. సింగపూర్ (90--95శాతం), మలేసియా (80--90శాతం), థాయిలాండ్ (75--85శాతం), ఇండోనేసియా (70--80శాతం) వియత్నాం (95శాతం), ఫిలిప్పీన్స్ (80--90శాతం) లాంటి దేశాలు కూడా భారత్ కంటే చాలా మెరుగైన స్థితిలోనే ఉన్నాయి. జపాన్‌లో అయితే 90శాతం పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. దక్షిణ కొరియాలో అయితే 98శాతం పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు వెళుతున్నారు. అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, మెక్సికో, కొలంబియా, పెరు లాంటి దేశాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఎక్కువ. పాఠశాల విద్యకు సముచిత ప్రాధాన్యాన్ని ఇవ్వనందుకు మనం చాలా మూల్యం చెల్లించాం. 1960ల నాటికే పాఠశాల విద్యకు ప్రాధాన్యాన్ని ఇచ్చిన దేశాలు ఆర్థికాభివృద్ధిలో దూసుకువెళ్లాయి. పటిష్ఠంగా పాఠశాల విద్యను పూర్తిచేసుకున్న దేశాల్లో నైపుణ్యం ఉన్న శ్రామికులు తొందరగా తయారవుతారు. ఆ సౌలభ్యం ఉంటే ప్రపంచమార్కెట్‌లో పోటీపడే రీతిలో వస్తూత్పత్తిచేయటానికి సాధ్యమవుతుంది. హాంకాంగ్, సింగపూర్, దక్షిణకొరియా, తైవాన్‌లు అలాగే ప్రపంచ మార్కెట్‌పై పట్టుని సాధించాయి. జపాన్ ఆ సామర్థ్యాన్ని 20వ శతాబ్దం ఆరంభం నాటికే సాధించింది. తొలినుంచీ మనం పాఠశాల విద్యకు అవసరమైన ప్రాధాన్యం ఇవ్వకుండా యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎంల వైపు అధిక మొగ్గు చూపించాం. దీనివల్ల మన ఆర్థిక వ్యవస్థ ఇముడ్చుకోలేని సంఖ్యలో ఉన్నత విద్యారంగం నుంచి విద్యార్థులు తయారయ్యారు. అందుకే ఈ వర్గం విద్యార్థుల చూపు విదేశాల వైపు మళ్లింది. వలసపోవటం వల్ల ఉన్నత శాస్త్ర, సాంకేతిక విద్యావంతుల నుంచి అవసరమైన ఆవిష్కరణలూ దేశంలో తగినంతగా రాలేదు. ఉన్నత విద్యకు అతిగా ప్రాధాన్యం ఇవ్వటంతో దాన్ని అగ్రకులాల పిల్లలే ఎక్కువగా అందిపుచ్చుకున్నారు. విదేశాలకు వెళ్లిన వాళ్లలో ఆ కులాల పిల్లలదే సింహభాగమైంది. విడివిడి గురుకులాల వల్ల కులం గోడలు గట్టిపడుతున్నాయని గుర్తించటం వరకూ బాగానే ఉంది. ఇతరత్రా గట్టిపడుతున్న కులం గోడలను కూడా గుర్తించి విరుగుడు చర్యలు తీసుకోకపోతే అవింకా గట్టిపడతాయి. కులాలు, మతాలు అవాంఛనీయంగా బలపడటానికి రాజకీయాలే ప్రధానకారణం. మందిర్--మసీదు చుట్టూ వివాదాలు చెలరేగి వైమనస్యాలు పెరగటానికి రాజకీయాలే కీలకపాత్రను పోషించాయి. నిజమైన వెనుకబాటుతనాన్నీ, ఆర్థిక అంతరాలనూ పరిగణనలోకి తీసుకోకుండా, గుండుగుత్తగా కులాల జనాభా ప్రకారమే పదవులూ, ఉద్యోగాల్లో వాటాలు నిర్ణయం కావాలన్న రాజకీయ నినాదాలు... బలహీనమవుతున్న గోడలను బలోపేతమే చేస్తున్నాయి. పార్టీలు టిక్కెట్లను కులాల లెక్కల ఆధారంగా కేటాయించటం గోడలను కూలిపోకుండా కాపాడుతున్నాయి. ప్రతికులానికి ఒక కార్పొరేషన్ పెట్టి భూములనూ నిధులనూ కేటాయించి, పదవులను పంచిపెట్టటం గోడలు పటిష్ఠం అవ్వటానికే దోహదం చేస్తున్నాయి. ఆధునిక పరిశ్రమల ధాటికి కకావికలు అయిపోయిన సంప్రదాయ వృత్తులను కాపాడటానికి కార్పొరేషన్లను ఏర్పాటుచేస్తే అర్థంపర్థం ఉంటుంది. ఎటువంటి సంప్రదాయ వృత్తుల్లో లేని అగ్రకులాలకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటుచేసి పదవులను కట్టబెట్టటం ఆ గోడలను కాపాడే రాజకీయాలే అవుతాయి. కులాన్ని ఒకచోట బలహీనపరచటం సంతోషించాల్సిన విషయమే అయినా దాని ఊడలు అన్నిరంగాల్లోనూ వ్యాపించాయి. ఊడలు సమస్యే కావచ్చు కానీ వృక్షమే మూల సమస్య! దానికి అన్నిరకాల పోషకాలు అందించటమే అసలు విషాదం!

# అందరికీ ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ ఉద్యోగ దంపతులు

-తమ కుమార్తెను ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ స్కూల్‌లో చేర్పించిన వైనం
-ప్రభుత్వ పాఠశాలపై నమ్మకానికి ఇదే నిదర్శనం
-హర్షం వ్యక్తం చేస్తున్న పలువురు విద్యావేత్తలు, బస్తీ వాసులు

హంసకలం వార్త




ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తూ అందరికీ ఆదర్శప్రాయమైన నిర్ణయం తీసుకున్నారు ఇల్లందు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగ దంపతులు.వివరాల్లోకి వెళితే...సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన గంట ప్రదీప్,జ్యోతి ప్రభుత్వ ఉద్యోగ దంపతులు.ఉద్యోగ రీత్యా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని స్టేషన్ బస్తీలో నివాసముంటున్నారు.గంట ప్రదీప్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల ప్రభుత్వ పాఠశాల ఎస్‌జీటీ గా విధులు నిర్వహిస్తుండగా,భార్య వల్లపుదాసు జ్యోతి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నర్సింగ్ ఆఫీసర్ గా పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఆదర్శ భావాలు కలిగిన దంపతులు తమ చిన్నారిని తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు తామే ముందుగా తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మెరుగైన మౌలిక వసతులు, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ విద్యాసంస్థలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలి" అని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగ దంపతుల ఈ నిర్ణయం ఇతర తల్లిదండ్రులకు స్ఫూర్తిగా నిలుస్తుందని,ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని స్థానికులు అభినందిస్తు న్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రమేష్, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి ,ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ సౌందర్య, ఆయాలు సుజాత,ప్రియ, బస్తీ వాసులు భాగ్య,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి..

-జగన్నాథపురం రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్..

హంసకలం వార్త



రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాథపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి ప్రామాణికతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. యూరియా బుకింగ్‌ను కూడా యాప్ ద్వారా నిర్వహిస్తున్నామని, రైతులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా బుకింగ్ యాప్, విత్తనమేలపై రైతులలో అవగాహన కలిగించాలని వ్యవసాయ శాఖ అధికారులని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, వ్యవసాయ అవసరాలన్నీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ చేతులమీదుగా విత్తనాలు, యూరియా అందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, తాసిల్దార్ ధారా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భరోసా కేంద్రాల సేవలను మరింత బలోపేతం చేయాలి







-బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలి
-అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

హంసకలం వార్త

మహిళలు,చిన్నారులపై జరిగే హింస,లైంగిక వేధింపులు,పోక్సో కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని భరోసా కేంద్రం ఆధ్వ ర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు .భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు ఒకేచోట వైద్య,న్యాయ,మానసిక, పునరావాస సేవలు అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో 2021 నుంచి 2026 వరకు పోక్సో,అత్యాచారం,మహిళలు, చిన్నారులపై జరిగిన 806 కేసులు భరోసా కేంద్రం పరిధిలో నమోదయ్యాయని,వాటిలో 16 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయని, బాధితులకు రూ.1.68 కోట్లకు పైగా పరిహారం అందించినట్లు వెల్లడించారు.పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా పోలీసులు, ప్రాసిక్యూషన్,వైద్య, ఫోరెన్సిక్, భరోసా కేంద్రం అధికారులు సమిష్టిగా పని చేయాలని ఎస్పీ సూచించారు. సాంకేతిక ఆధారాలు, వైద్య నివేదికలు, బాధితుల వాంగ్మూ లాలను నిర్దిష్ట గడువులో కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. బాల్య వివాహాల నివారణతో పాటు పోక్సో చట్టం, బాలల హక్కులు,సైబర్ నేరాలపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచి ంచారు. లైంగిక వేధింపులకు గురైన బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేసేలా ప్రోత్సహి ంచాలని, ప్రభుత్వం అందించే పరిహారం పథకాలపై కూడా అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి విశ్వనాథ్ కులకర్ణి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సాయి మేఘనా,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య,పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్ కుమార్,మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల భరోసా ఇన్‌చార్జ్ ఎస్ఐ అమ్రిన్,భరోసా కేంద్రం కోఆర్డినేటర్ నళినతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

-ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
-కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అత్యాధునిక వసతులు
-పెద్దకొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన ఆర్జేడీ సోమిరెడ్డి



హంసకలం వార్త

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) ఏర్పాటు కార్యక్రమం వేగంగా ముందుకు సాగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఈడబ్ల్యూఐడీసీ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, జిల్లాస్థాయి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆర్జేడీ యం. సోమిరెడ్డి సందర్శించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపికైన ఈ ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత, పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కళాశాలలో ఉన్న భౌతిక వసతులు, ప్రస్తుతం ఉన్న తరగతి గదుల పరిస్థితి, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ అవసరాలు, నిర్మాణ విస్తరణ అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఒక్కో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రూ.15 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు, పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా ప్రభుత్వం ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రతి నియోజకవర్గంలో ఒక పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కల్వకుర్తి నియోజకవర్గంలో వెల్దండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అలాగే జిల్లాలో కొనసాగుతున్న మోడల్ స్కూల్స్‌ను కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థలోకి తీసుకురావడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నిరంతర విద్యా విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇంగ్లీష్ మీడియం బోధన అందించడంతో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్స్, స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే క్రీడా మైదానాలు, ఇండోర్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికలు, పోషకాహార భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, ఆధునిక మరుగుదొడ్లు, వైద్య సేవలు వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు , తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు నగర స్థాయి విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అందుబాటులో ఉన్న సుమారు ఆరు ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించి, భవిష్యత్‌లో నిర్మించాల్సిన అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, పరిపాలనా భవనాలు, వసతి గృహాలు, భోజనశాలలు, క్రీడా మైదానాల ఏర్పాటుకు సంబంధించిన అవకాశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించారు. డ్రోన్ సాంకేతికత సహాయంతో పాఠశాల ప్రాంగణాన్ని చిత్రీకరించి, భవిష్యత్ అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఈడబ్ల్యూఐడీసీ రామచంద్రరావు, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, ఎంఈఓ ఉమాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడి

### కుటుంబానికి రూ.10 లక్షల బీమా చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



హంసకలం వార్త

ప్రమాదవశాత్తు మరణించిన తరోడ గ్రామపంచాయతీ కార్మికుడు లక్ష్మణ్ భార్య భూమాబాయికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంజూరైన రూ.10 లక్షల గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ (బీమా)చెక్కును జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు,కార్మికులు కేవలం రూ.549 చెల్లించి రూ.10 లక్షల గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ బీమా సౌకర్యాన్ని పొందవచ్చని తెలిపారు.నిరుపేద కుటుంబాలకు బీమా పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తాయని పేర్కొన్నారు.దప్రమాదాల బారిన పడి కుటుంబ యజమానిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా ఇలాంటి బీమా నిధులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఉద్యోగులు,కార్మికులు ఈ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు,పోస్టల్ బ్యాంకింగ్ సర్వీసెస్ సీనియర్ మేనేజర్ రాజేష్ కుమార్, పంచాయతీ అధికారి (డీఎల్పీవో)ఫణీందర్ రావు, పోస్టల్ శాఖ ఉన్నతాధి కారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమ విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి

-జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి
-ప్రతి శాఖ విజయాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజా ఫిర్యాదుల ని పరిష్కార వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలి..
-రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై గత ఏడాదితో పోల్చి విశ్లేషణ చేయాలి..
-గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలి..
-ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి..
-ప్రతి శాఖ విజయగాథలు, ఉత్తమ ఫొటోలతో ఐదు రోజుల్లో ప్రత్యేక బుక్‌లెట్ సిద్ధం చేయాలి...
-99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా ప్రత్యేక అధికారి



హంసకలం వార్త

99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎండీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మంజిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎండీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "ప్రతి ప్రసవం సురక్షితం" కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, పంట అవశేషాల దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాలు, యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో ఘనంగా ఒలింపిక్ డే రన్

హంసకలం వార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా పాల్వంచలో ఘనంగా ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ నుండి అల్లూరి సెంటర్ వరకు వెళ్లి తిరిగి అంబేద్కర్ సెంటర్ వద్ద ముగిసిన ఈ రన్‌లో క్రీడాకారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ ( టిజిఎస్ పిఎస్) సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జోరున కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొని ఒలింపిక్ క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాల్వంచ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి ఒలింపిక్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రతి క్రీడాకారుడి జీవితంలో ఒలింపిక్ పతకం సాధించడం అత్యున్నత లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అంకితభావంతో శ్రమించాలి. ఒలింపిక్ డే రన్ వంటి కార్యక్రమాలు యువతలో క్రీడా స్ఫూర్తిని నింపి, గ్రామ గ్రామాన క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయి. భవిష్యత్తులో మన జిల్లాకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి కీర్తి తేవాలని ఆకాంక్షిస్తున్నాను" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ క్రీడా జ్యోతిని టీజీఎస్పీఎఫ్ డీఎస్పీ చంద్రశేఖరరావు వెలిగించి రన్‌కు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ, "ప్రపంచ క్రీడల్లో ఒలింపిక్స్‌కు



అత్యున్నత స్థానం ఉంది. భారతదేశం మరిన్ని ఒలింపిక్ పతకాలు సాధించాలంటే ప్రతి గ్రామంలో క్రీడా స్ఫూర్తి పెరగాలి. నేటి యువత కష్టపడి సాధన చేస్తే రేపటి ఒలింపియన్లుగా ఎదగగలరు అన్నారు. పాల్వంచ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, "వర్షం కురుస్తున్నప్పటికీ క్రీడా స్ఫూర్తితో పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడం అభినందనీయం. క్రీడలు యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. యువత క్రీడల్లో రాణించి పోలీస్, ఆర్మీ వంటి సేవా రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరుకుం టున్నాను" అన్నారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్ అధ్యక్షత వహించారు. తక్కువ సమయంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించి స్పాన్సర్‌షిప్ అందించిన కేటీపీఎస్ ( టిజె ఎల్ ఎస్ ఎస్ ) ఏడీఈ తోకల రామదాసును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాసపల్లి రాజేంద్ర ప్రసాద్, జాయింట్ సెక్రటరీ నాగేందర్, ఆర్చరీ కోచ్ కళ్యాణ్, కోకో అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతరావు, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రవీణ్, అథ్లెటిక్స్ కోచ్ ఎర్రయ్య, పవన్, డిగ్రీ కళాశాల పీడీ శ్వేత, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పీడీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

-ఆర్టీసీ రెవెన్యూ పెంచే విధంగా ప్రజలు సహకరించాలి.
-ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11రూట్లలో ఆర్టీసీ సర్వీసులు.
-ధర్మపురి నుంచి నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి అడ్లూరి.

హంసకలం వార్త

తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ధర్మపురికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్ కు రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి మంగళవారం ధర్మపురి బస్టాండ్ లో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ధర్మపురి శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం నిర్మల్ నుంచి ధర్మపురి వరకు ఎక్స్ ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఉదయం 7గంటలకు నిర్మల్ నుంచి దస్తురాబాద్, కడెం, ఖానాపూర్ మీదుగా ధర్మపురి వస్తుందని మంత్రి వివరించారు. రోజుకు రెండు ట్రిపుల చొప్పున నిర్మల్ -- ధర్మపురి మధ్య బస్సు నడుస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా ప్రయాణం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించినట్లు



వివరించారు. కొత్త సర్వీస్ ఉదయం 7గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి, రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం మీదుగా కరీంనగర్ చేరకుంటుందని తెలిపారు. కొత్త సర్వీస్ విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగంగా ఉంటుందని మంత్రి తెలిపారు. అదే విధంగా కరీంనగర్ నుంచి రాత్రి 9గంటలకు ధర్మపురికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ మంత్రి పొన్న ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ చోరవత్ ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి అనుమతి తీసుకున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థుల సౌకర్యం కోరకు నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి ఆదాయం వచ్చే విధంగా సహకరించాలని మంత్రి కోరారు. జిల్లా గంధ్రాలయ సంస్థ ఛైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ ఆర్టీసీ సేవలు అందిస్తుందన్నారు. ధర్మపురికి వచ్చే భక్తుల కోసం నూతనంగా నడిపిస్తున్న సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపాల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పందరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ ఎం నిర్మల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

-ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్
-పాల్వంచ గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు..

హంసకలం వార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గల బాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పి రోహిత్ రాజు పాఠశాల విద్యార్థుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించి,అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్య క్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక లాంటివారు, క్షణకాలపు ఆనందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై, తమ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, వైజ్ఞానిక పరిజ్ఞానం పిల్లలకు అవసరమని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి నుండి ఉపశమనానికై క్రీడలపై ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాది ంచాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని,చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా జిల్లాలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర సమయాల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని



సూచనలు చేశారు. అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. సుమారు 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్. సతీష్ కుమార్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు, పాఠశాల మరియు కళాశాల, అధ్యాపకులు,ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూముల సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

హంసకలం వార్త

భూముల రీ సర్వే, సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ లక్ష్మణచందా మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న భూముల రీ సర్వే, సర్వే తీరును పరిశీలించారు. ముందుగా ముని పెల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన రీ సర్వే తీరును కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాలకు రెవెన్యూ మ్యాపులు లేకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, రీ సర్వే ద్వారా గ్రామాల రెవెన్యూ మ్యాపులు సిద్ధం చేయాలన్నారు. అధునాతన కొలతల యంత్రాల సామాగ్రిని ఉపయోగించి సర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సర్వే చేయడం వల్ల రైతులకు సంబంధించిన భూముల సమస్యలు తొలగిపోతాయని అన్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సర్వే వివరాలను పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. అనంతరం చావన్ పల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సర్వే ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్,ఆర్డీవో దేవీదాస్, తహసిల్దార్ సరిత,డిప్యూటీ ఇన్స్ పెక్టర్ విటల్ రావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సన్న రకాలు సాగు చేయండి

-రైతులు సంక్షేమం సర్కార్ ధ్యేయం

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హంసకలం వార్త

రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు.ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు.గొల్లపల్లి మండలం శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరం గా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేది నుంచి 31వ తేది వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

-కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి..

-డిల్లీలో కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎంయిర్ పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాంమోహన్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసిన మంత్రులు తుమ్మల మరియు ఉత్తమ్..

-భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఎంయిర్ పోర్ట్ ..

హంసకలం వార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.మంగళవారం నాడు డిల్లీలో రాశీమోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రులు తుమ్మల ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎంయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎంయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎంయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎంయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేశామని అక్కడ త్వరగా ఫీజుబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

-జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు..
హెవీ వాటర్ ప్లాంట్..ఐటీసీ

బీ. పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎంయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎంయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.



# గజ్వేల్ ఐఓసి గ్రౌండ్‌లో ఒలింపిక్ రన్ కార్యక్రమం

హంసకలం వార్త

గాజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో గల గజ్వేల్ ఐఓసి గ్రౌండ్‌లో నిర్వహించిన ఒలింపిక్ రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యాదవ రెడ్డి,గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జివంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా రన్నింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను శాలువాలతో సన్మానించి,ప్రోటీన్ కిట్లు ను అందజేశారు. అనంతరం పిల్లలతో కలిసి అల్పాహారం చేసి వారిని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పార్టీ ముఖ్య నాయకులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడల పట్ల యువత ఆసక్తి పెంపొందించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.



## అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం-2026 ప్రత్యేక క్రీడా పోటీలు



హంసకలం వార్త

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం-2026 (నషా ముక్త్ భారత్ సప్తాహ్)లో భాగంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించారు.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, వ్యసనాల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలనే ముఖ్య లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మిల్కా మాట్లాడుతూ...యువతులకు 400 మీటర్ల రన్నింగ్,అలాగే యువకులకు 400, 800 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.క్రీడలు శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా,యువతను పెడదోవ పట్టకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కాగా,ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 25న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.ఈ క్రీడా పోటీల కార్యక్రమంలో జిల్లా యువజన,క్రీడల అధికారి దయానంద్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ క్రీడల అధికారి పార్థసారథి,కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సాయి కుమార్,యువతీ యువకులు,ఇతర అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో వెలుగుమట్ల పేదల సొంతింటి కల సాకారం

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్..

-ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి..

-వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం.. వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు..

-నిర్దిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి..

-వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్..

హంసకలం వార్త



ప్రభుత్వం పేద కుటుం బాలకు గౌరవ ప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వి నియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# మదుపర్లకు నష్టాలు...సెన్సెక్స్, నిఫ్టీ డౌన్!

ఇంటర్నెట్ డెస్క్:

దేశీ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు నష్టాలతో ముగిశాయి. ఐటీ రంగంతో పాటు లోహాలు, కమోడిటీ షేర్ల అమ్మకాలు కొనసాగడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 893 పాయింట్ల నష్టంతో 76,200.28 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 278 పాయింట్ల నష్టంతో 23,824 వద్ద క్లోజైంది. బ్యాకింగ్ రంగంలో అమ్మకాలు కనిపించడంతో మదపర్లుకు నష్టాలు మిగిలాయి. ఈ సీజన్‌లో లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడవచ్చన్న అంచనాలు కూడా మదుపర్ల సెంటీమెంట్‌ను దెబ్బతీశాయి. అయితే, ఫార్మా, హెల్త్‌కేర్ రంగంలో కొనుగోళ్లు పెరగడంతో సూచీల పతనానికి కొంత మేర అడ్డుకట్టు పడింది.




రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ 3 శాతం మేర పతనమైంది. నిఫ్టీ ఐటీ కూడా నష్టాలను మూటగట్టుకుంది. నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి. ఇక నిఫ్టీ మిడ్ క్యాప్, నిఫ్టీ స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.10 శాతం, 0.58 శాతం మేర నష్టాలను ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్‌లో పవర్ గ్రిడ్ (0.95 శాతం), మారుతీ షేర్లు (0.07 శాతం) స్వల్ప లాభాలతో ముగిశాయి. ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ, టాటా కన్సల్టెన్సీ షేర్లు టాప్ లూజర్లుగా మిగిలాయి.

## అరబిందో చేతికి లాన్నెట్

-డీల్ విలువ రూ.2,365 కోట్లు




హైదరాబాద్ ( బిజినెస్):

అరబిందో ఫార్మా.. మరో అమెరికా కంపెనీని కొనుగోలు చేస్తోంది. అమెరికాలోని పెన్సిల్వేనియా కేంద్రంగా పనిచేసే క్లిష్టమైన జెనరిక్ ఔషధాల తయారీ సంస్థ లాన్నెట్ కంపెనీ ఎల్‌ఎల్‌సీను 25 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2,365 కోట్లు) కొనుగోలు చేస్తున్నట్టు అరబిందో ఫార్మా రెగ్యులేటరీ సంస్థలకు వెల్లడించింది. ఈ కొనుగోలుకు యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) కూడా ఇందుకు అమోదం తెలిపింది. అమెరికాలోని తన అనుబంధ సంస్థ అరబిందో ఫార్మా యూఎ?సఏ ఇంక్ ద్వారా ఈ కొనుగోలు చేస్తున్నట్టు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఈ నెలాఖరులోగా లాన్నెట్ కొనుగోలు పూర్తి కావచ్చని పేర్కొంది.

# ఏఐ కారణంగా లేఆఫ్స్.. ఒరాకిల్ ధ్రువీకరణ

ఇంటర్నెట్ డెస్క్:

అంతర్జాతీయ టెక్ దిగ్గజ సంస్థ ఒరాకిల్ ఇటీవల కాలంలో ఏఐ కేంద్రంగా తన కార్యక్రమాలను పునర్ వ్యవస్థీకరిస్తోంది. ఈ నేపథ్యంలో 2026 ఆర్థిక సంవత్సరంలో 21 వేల మంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందని ఒరాకిల్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని లేఆఫ్స్‌కు అవకాశం కూడా ఉందని పేర్కొంది. ఏడాది కాలంలో తమ సంస్థలో ఉద్యోగుల సంఖ్య 13 శాతం తగ్గిందని పేర్కొంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా ఒరాకిల్ ఉద్యోగుల సంఖ్య దాదాపు1.62 లక్షలు కాగా ఈ ఏడాది మే 31 నాటికి 1,41,000లకు పడిపోయింది.సోమవారం ఒరాకిల్ తన వార్షిక నివేదికను విడుదల చేసింది. తమ కార్యకలాపాల్లో ఏఐ పాత్ర పెరగడంతో ఉద్యోగుల సంఖ్యలో కోత పడిందని చెప్పింది. మేనేజ్‌మెంట్, ఉత్పత్తుల్లో మార్పులు, పనితీరు సంబంధిత అంశాలు, వ్యూహాత్మక మార్పులు, ఇతర సంస్థల కొనుగోళ్లు వంటివి కూడా లేఆఫ్స్‌కు కారణమని తెలిపింది. వాస్తవానికి ఒరాకిల్‌లో కీలక మార్పులు రానున్నాయని సంస్థ మార్చిలోనే పేర్కొంది. ఏఐ డేటా సెంటర్ల విస్తరణకు నిధుల కొరత ఏర్పడిన నేపథ్యంలో ఉద్యోగుల సంఖ్య తగ్గించే అవకాశం ఉందని వెల్లడించింది.




ఒకప్పుడు డేటాబేస్ సాఫ్ట్‌వేర్ సంస్థగా ఉన్న ఒరాకిల్ ఏఐ జమానాలో కీలక మార్పులకు లోనవుతోంది. సంస్థ చైర్మన్ లారీ ఎల్లిసన్ సారథ్యంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో మేటి కంపెనీగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో సంస్థలో మునుపెన్నడూ లేని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఓపెన్ ఏఐ లాంటి సంస్థల ఏఐ వర్క్ లోడ్స్‌కు అవసరమైన స్థాయిలో భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది.

ఈ రంగంలో ఇప్పటికే వేళ్లూనుకున్న అమెజాన్, మైక్రోసాఫ్ట్ సంస్థల ఆధిపత్యానికి ఒరాకిల్ సవాలు విసిరేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కావాల్సని నిధుల కోసం రుణాలపై ఒరాకిల్ ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 70 బిలియన్ డాలర్ల క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ ఉండవచ్చని సంస్థ అంచనా వేసింది. డెట్, ఈక్విటీల ద్వారా 40 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. లేఆఫ్స్ నేపథ్యంలో ఉద్యోగులకు సెవరెన్స్ ప్యాకేజీల కింద సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 1.84 బిలియన్ డాలర్లను చెల్లించింది.

# భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం

స్పోర్ట్స్ డెస్క్:

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన గౌరవం దక్కింది. దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డును ఇవాళ (జూన్ 23) అందుకున్నాడు. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును రోహిత్ శర్మ అందుకున్నాడు. ఈ ఏడాది జనవరిలోనే రోహిత్‌తో పాటు భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌కు కూడా పద్మశ్రీ ప్రకటించారు. ఆమె గత నెలలో అవార్డు అందుకోగా తాజాగా రోహిత్ శర్మ ఈ గౌరవాన్ని స్వీకరించాడు.

గత కొన్నేళ్లుగా భారత జట్టుకు రోహిత్ అందించిన సేవలు, అతని నాయకత్వంలో జట్టు సాధించిన విజయాలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారంతో సత్కరించింది. ఈ కార్యక్రమానికి పలువురు ఇతర రాజకీయ ప్రముఖులు, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృతరాజ్, నటుడు మమ్ముట్టి, నేపథ్య గాయని అల్కా యాగ్నిక్ కూడా హాజరయ్యారు. రోహిత్ కెప్టెన్సీలో భారత్ జట్టు టీ20 ప్రపంచకప్2024 టైటిల్ గెలుచుకోవడంతో పాటు 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుంది. అలానే అతడి నాయకత్వంలో భారత జట్టు 2023 ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్‌కు కూడా చేరుకుంది.




పద్మశ్రీ అందుకున్న భారత క్రికెట్ ప్రముఖుల జాబితాలో తాజాగా రోహిత్ కూడా చేరాడు. ఇప్పటికే క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ, రాహుల్ ద్రవిడ్, గౌతమ్ గంభీర్, కపిల్ దేవ్, ఎంఎస్ ధోని వంటి దిగ్గజాలు ఈ గౌరవాన్ని అందుకున్నారు. హామ్‌స్ట్రింగ్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్న ఈ టీమిండియా మాజీ కెప్టెన్ త్వరలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్నాడు. శుభ్‌మన్ గాల్ నాయకత్వంలోని భారత జట్టు జూలై 14 నుంచి 19 వరకు జరిగే మూడు వన్డేల సిరీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది.

# మహిళల క్రికెట్‌లో భారత యువ స్పిన్ సంచలనం శ్రీ చరణి సరికొత్త చరిత్ర

స్పోర్ట్స్ డెస్క్:

మహిళల క్రికెట్‌లో భారత యువ స్పిన్ సంచలనం శ్రీ చరణి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతోన్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్న ఆమె.. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. టీ20 ప్రపంచ కప్ 2026లో ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచుల్లోనే 10 వికెట్లు పడగొట్టి లీడింగ్ వికెట్ టేకర్‌గా నిలిచింది శ్రీచరణి. దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత్ ఓడినప్పటికీ.. చరణి (3/24) అద్భుత బౌలింగ్‌తో మెరిసింది. ఈ ప్రదర్శనతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీచరణి(753 పాయింట్లు) ఇంగ్లాండ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ లిన్సే స్మిత్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. ఈ ప్రపంచకప్ 2026 టోర్నీలో శ్రీ చరణి ప్రదర్శన భారత జట్టుకు ప్రధాన బలంగా మారింది. టోర్నీ తొలి మ్యాచ్‌లోనే నెదర్లాండ్స్‌పై 4/19తో చెలరేగిన ఆమె, అంతకుముందు పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా 3/21తో సత్తా చాటింది. ఈ టోర్నీలో తాజా ప్రదర్శనతో ప్రపంచకప్2020లో భారత స్పిన్నర్ పూనమ్ యాదవ్ నెలకొల్పిన అత్యధిక వికెట్ల (10) రికార్డును చరణి సమం చేసింది. గ్రూప్ దశలో ఇంకా రెండు మ్యాచులు ఉండటంతో శ్రీచరణి త్వరలో పూనమ్‌ను దాటేసి సరికొత్త చరిత్ర సృష్టించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు ఐసీసీ విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇంగ్లండ్ స్పిన్నర్ చార్లీ డీన్ 733 పాయింట్లతో రెండో స్థానానికి చేరగా, లిన్సే స్మిత్(726) మూడో స్థానానికి పడిపోయింది. మరోవైపు భారత సీనియర్ స్పిన్నర్ దీప్తి శర్మ(708) మూడు స్థానాలు కోల్పోయి.. ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్(722) నాలుగు స్థానాలు ఎగబాకి నాల్గో ర్యాంకుకు చేరుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలో వెస్టిండీస్ ప్లేయర్ హేలీ మాథ్యూస్ 513 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. చమరి ఆటపట్టు(365) దీప్తిని(364) వెనక్కి నెట్టి ముందంజ వేసింది. భారత్‌పై అజేయ హాఫ్ సెంచరీ (81లి), రెండు వికెట్లతో మెరిసిన దక్షిణాఫ్రికా వెటరన్ మరిజానే కాప్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 9వ ర్యాంకుకు చేరుకుంది.




# స్పోర్ట్స్

## భారత జట్టులోకి పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గె




స్పోర్ట్స్ డెస్క్:

పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గె తొలిసారి భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. మరికొద్ది రోజుల్లో ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో జరిగే టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో సూర్యాంశ్ చేరాడు. హైదరాబాదీ ప్లేయర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో అతడిని బీసీసీఐ ఎంపిక చేసింది. జూన్ 20న అఫ్ఘనిస్థాన్ తో జరిగిన మూడో వన్డే తర్వాత నితీశ్ రెడ్డి ఎడమ తొడ కండరాలలో నొప్పితో బాధపడ్డాడు. వైద్య పరీక్షల అనంతరం కొంతకాలం పునరావాసం పొందాలని బీసీసీఐ వైద్య బృందం సిఫార్సు చేసింది. దీంతో అతడు ఈ రెండు టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇటీవల శ్రీలంకలో ముగిసిన ముక్కోణపు సిరీస్‌లో భారత-ఎ జట్టు తరఫున మంచి ప్రదర్శన చేసిన నేపథ్యంలో సూర్యాంశ్‌కు బీసీసీఐ నుంచి ఈ పిలుపు అందింది. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసిన ఈ యువ ఆటగాడు.. ముక్కోణపు సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లలో 147 పరుగులు సాధించడంతో పాటు, 23 ఓవర్లు బౌలింగ్ చేసి బంతితో కూడా రాణించాడు. అలానే సయ్యద్ ముస్తాక్ అలీ 2024-25లో ముంబై తరఫున లోయర్ మిడిల్ ఆర్డర్‌లో 251.92 స్ట్రైక్ రేట్‌తో 131 పరుగులు చేశాడు. అంతేకాక ఆ జట్టు తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. అలానే ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున సూర్యాంశ్ ఆడాడు. ఈ సీజన్‌లో ఆడిన 8 మ్యాచ్‌ల్లో 158 పరుగులతో స్ట్రైక్ రేట్ 175.56 గా నమోదైంది. లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు రాబట్టే ఫినిషర్‌గా పంజాబ్ జట్టు ఇతనికి అవకాశాలు కల్పించింది.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ

## పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్





-పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్
-రాష్ట్రపతి భవన్ వేదికగా అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానం
-కార్యక్రమానికి హాజరైన మోదీ, అమిత్ షా

మన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జాతీయ స్థాయిలో మరోసారి గర్వించదగ్గ గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ విడతలో మొత్తం 47 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయగా.. అందులో మన టాలీవుడ్ లెజెండ్స్ ఉండటం విశేషం.

నాలుగు దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో, హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్.. కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు.

నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సౌత్ ఇండస్ట్రీపై తమన్నా సంచలన వ్యాఖ్యలు!

-హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో లోటు ఉంది:
-సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా ఉంటుందన్న తమన్నా
-హీరోయిన్లను గ్లామర్ బొమ్మలుగా చూపించడం తనకు నచ్చదని వ్యాఖ్య
-గ్లామర్, నటన ఉన్నవాళ్లే సూపర్ స్టార్లు అవుతారన్న మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది.

దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది.



భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సౌత్ ఇండస్ట్రీలో కూడా తానే కాకుండా అనుష్క, నయనతార, సమంత వంటి వారు 10 నుంచి 15 ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నామంటే.. దానికి కారణం ఈ గ్లామర్, పెర్ఫార్మెన్స్ అనే రెండు విషయాలను పక్కాగా బ్యాలెన్స్ చేయడమేనని తమన్నా చెప్పుకొచ్చింది.

# ఈ నిర్ణయం చారిత్రాత్మకమంటూ ప్రశంసించిన నటి దీపికా పదుకొణె

-మహిళా క్రికెటర్ల కోసం ఐసీసీ ప్రసవానంతర మార్గదర్శకాలు
- స్పందించిన దీపికా పదుకొణె
-తల్లితనం, కెరీర్ మధ్య ఎంచుకోవాల్సిన పరిస్థితి రాకూడదన్న ఐసీసీ ఛైర్మన్ జై షా
-ప్రసవానంతరం ఆరు దశల్లో తిరిగి ఆటకు సిద్ధమయ్యేలా ప్రణాళిక

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) రూపొందించిన నూతన మార్గదర్శకాలను బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ప్రశంసించారు. ప్రసవానంతరం క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వెసులుబాటు కల్పించేలా రూపొందించిన ఈ నిబంధనలను, మహిళా క్రీడా రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా ఆమె అభివర్ణించారు. ప్రస్తుతం రెండోసారి గర్భవతిగా ఉన్న దీపిక, ఈ మార్గదర్శకాలకు సంబంధించిన వార్తను మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ ఐసీసీ నిర్ణయానికి మద్దతు తెలిపారు.

ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌నకు విరామం ప్రకటించిన రోజున ఐసీసీ ఈ 'రిటర్న్ టు ప్లే పోస్ట్ ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను సోమవారం విడుదల చేసింది. గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి అత్యున్నత స్థాయి క్రికెట్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన సమగ్ర సహకారాన్ని ఈ మార్గదర్శకాలు అందిస్తాయి. ఇందులో భాగంగా ప్రసవానంతరం కోలుకునే ప్రక్రియ, వైద్య పరీక్షలు, శిక్షణతో పాటు మానసిక మద్దతు వంటి అంశాలను దశలవారీగా పర్యవేక్షించనున్నారు.

ఈ సందర్భంగా ఐసీసీ ఛైర్మన్ జై షా మాట్లాడుతూ, "తల్లితనం కోసం క్రీడాకారిణులు తమ కెరీర్‌ను త్యాగం చేయాల్సిన పరిస్థితి రాకూడదు. దేశం తరఫున ఆడటం లేదా అమ్మతనం.. ఈ రెండింటిలో ఒకదాన్నే ఎంచుకోవాలన్న అగత్యం ఉండకూడదు" అని పేర్కొన్నారు. ఈ నూతన మార్గదర్శకాల్లో భాగంగా ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్, శిక్షణలో వెసులుబాటు, మానసిక ఆరోగ్య నిపుణుల తోడ్పాటు మరియు అవసరమైన చోట్ల శిశు



సంరక్షణ సౌకర్యాలను కల్పించాలని ఐసీసీ సిఫార్సు చేసింది. త్వరలోనే రెండో బిడ్డకు జన్మనివ్వనున్న దీపిక, ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారు.

# చిరంజీవికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన సమంత

-మెగాస్టార్ ప్రశంసలకు సమంత ఫిదా..
-కానీ చిరంజీవి ట్వీట్‌లో ఓ ఆసక్తికర లీక్!
-'మా ఇంటి బంగారం' చిత్రాన్ని మెచ్చుకున్న మెగాస్టార్ చిరంజీవి
-సమంత నటన, చీరకట్టులో యాక్షన్ సీన్లను ప్రత్యేకంగా ప్రశంసించిన చిరు
-సమంత-రాజ్ 'కొత్త అధ్యాయం' గురించి చిరు చేసిన వ్యాఖ్యతో కొత్త చర్చ





సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు కురిపించారు. అయితే, ఈ ప్రశంసలతో పాటు ఆయన చేసిన ఒక కీలక వ్యాఖ్య, సమంత ప్రెగ్నెన్సీపై జరుగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. 'మా ఇంటి బంగారం' సినిమా తనను ఎంతగానో ఆకట్టుకుందని చిరంజీవి 'ఎక్స్' వేదికగా తెలిపారు. "ఉమ్మడి కుటుంబ నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అద్భుతంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి చిత్రాన్ని ఎంతో వినోదాత్మకంగా తెరకెక్కించారు. ముఖ్యంగా చీరకట్టులో సమంత చేసిన యాక్షన్ సన్నివేశాలు చాలా ప్రభావవంతంగా ఉన్నాయి" అంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. అయితే, తన ట్వీట్ ముగింపులో "జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత-రాజ్ దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు" అని చిరంజీవి పేర్కొనడమే ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. ఈ 'కొత్త అధ్యాయం' అనే పదం సమంత గర్భం దాల్చడాన్ని ఉద్దేశించిందేనని, ఆమె ప్రెగ్నెన్సీ వార్తను మెగాస్టార్ పరోక్షంగా ధ్రువీకరించారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఇక, మెగాస్టార్ ప్రశంసలకు సమంత ఎంతో భావోద్వేగంతో స్పందించారు. "మెగాస్టార్ చిరంజీవి గారు, మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీలాంటి లెజెండరీ వ్యక్తి నుంచి అభినందనలు అందుకోవడం ఒక కలలా ఉంది. మా సినిమా మీకు నచ్చినందుకు ఎంతో సంతోషిస్తున్నాను" అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల కాలంలో చిరంజీవి తన సినిమాలకు సంబంధించిన కొన్ని కీలక విషయాలను మేకర్స్ కంటే ముందే అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన సమంత వ్యక్తిగత విషయాన్ని కూడా అనుకోకుండా లీక్ చేశారని సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. 'మా ఇంటి బంగారం' సినిమా ప్రశంసల సంగతి ఎలా ఉన్నా, చిరంజీవి చేసిన ఈ ఒక్క వ్యాఖ్యతో సమంత ప్రెగ్నెన్సీ వార్త మరోసారి తెరపైకి వచ్చి, అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449